సాక్షి మంచిర్యాల

మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



ఓసీసీ గుర్తింపు ఎన్నికలెప్పుడు..?

ఓసీసీ ఎన్నికల నిర్వహణపై ఊసేలేదు. మూడున్నరేళ్లలో యూనియన్ కమిటీ సమావేశాలు నిర్వహించలేదు. ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. 8లో▸



నేడు ప్రజాభిప్రాయ సేకరణ

శ్రీరాంపూర్ డివిజన్‌లోని రెండు భూగర్భ గనులకు మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. శాంతి మైదానంలో సభ ఏర్పాటు చేస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
38.0 /26.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఈశాన్యం దిశగా వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సంబంధిత శాఖ సమన్వయంతో పరిశీలించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన అదనపు కలెక్టర్ చాంబర్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, భూ కబ్జాలు, అక్రమ నిర్మాణాలు, పట్టా పాస్‌పుస్తకం మంజూరు, ధరణిలో వివరాల నమోదు తదితర అంశాలపై దరఖాస్తులు అందజేశారు.

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు మాక్‌డ్రిల్



ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న వైద్యులు

మంచిర్యాలటౌన్: దేశవ్యాప్తంగా కోవిడ్–19 మహమ్మారి వేగంగా వ్యాపిస్తుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తం అయ్యాయి. దీంతో సోమ, మంగళవారాల్లో అన్ని జిల్లాల్లో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించాలన్న ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో జిల్లాలో కోవిడ్ చికిత్స అందించే ఆసుపత్రులు, వైద్యులు, వైద్య సిబ్బంది, కోవిడ్ టెస్టులకు సంబంధించిన కిట్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, 155 సబ్ సెంటర్లు, 17 ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం అందించే వివరాలు నమోదు చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది, ఏఎస్‌ఎంలు, బెడ్‌లు, టెస్టింగ్ కిట్లు, కోవిడ్ వచ్చిన వారికి అందించే మందుల కిట్ వివరాలను నమోదు చేసినట్లు జిల్లా కోవిడ్ నియంత్రణ అధికారి డాక్టర్ ఫయాజ్‌ఖాన్ తెలిపారు.

కార్మికుల నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

పాతమంచిర్యాల: పాతమంచిర్యాల శివారులోని రంగపేటలో ఉన్న శాలివాహన గ్రీన్ ఎనర్జీ ప్లాంటు కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం పవర్‌ప్లాంటులో నిరాహార దీక్ష చేపట్టారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకుండా, కార్మికులతో చర్చలు జరపకుండా యాజమాన్యం కంపెనీకి తాళాలు వేసుకుని వెళ్లిందని తెలిపారు. ఒప్పందం ముగియడంతో ప్లాంటులో ఉత్పత్తి జరగడం లేదని, అనధికారిక లే ఆఫ్‌కొనసాగుతోందని పేర్కొన్నారు. ఉత్పత్తి ప్రారంభించాలని, సమస్యలు పరిష్కరించే వరకు నిరాహార దీక్ష కొనసాగుతుందని తెలిపారు. పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, జనరల్ సెక్రెటరీ ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఆనందరావు, కాయితి శ్రీనివాస్, కోశాధికారి డి.మల్లయ్య, కార్మిక సంఘం నాయకులు ఆసరి రాజయ్య, ఎస్.తిరుపతి, కే.బుచ్చయ్య, సలహాదారులు ఎర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతు



ఎంఆర్‌ఆర్ కింద మరమ్మతులు చేపట్టనున్న నెన్నెల-మన్నెగూడెం రోడ్డు



దెబ్బతిన్న నారాయణపూర్ రోడ్డు(ఫైల్)

- పంచాయతీరాజ్ పరిధిలో 86చోట్ల
- ఎంఆర్ఆర్, జీటీఆర్ కింద నిధులు మంజూరు
- వానాకాలంలో దెబ్బతిన్న రోడ్లకూ మోక్షం
- ఈ వేసవిలో పూర్తయితేనే గ్రామీణులకు మేలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాల్లోని చాలా పల్లెల్లో రహదారులు ధ్వంసం కావడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. అంతకు ముందున్న వాటితోపాటు గత వర్షాకాలంలో వరదలకు అనేక చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించింది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పల్లె రోడ్లు మెరుగుపర్చాలని ఎంఆర్ఆర్(మెయింటనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్స్), బీటీఆర్(బ్లాక్ టాప్ రెన్యూవల్), వరదలతో దెబ్బతిన్న రహదారులను నిధులతో బాగు చేయాల్సి ఉంది. వర్షాకాలం రాకముందే ఈ వేసవి ముగిసేలోపు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇంకా చాలా చోట్ల టెండర్ల దశ దాటకపోవడంతో ఈ వేసవిలోపు పూర్తి చేయాలనే ఆదేశాలు ఉన్నా.. ఆ మేరకు పనులు పూర్తవుతాయో లేదో చెప్పలేని పరిస్థితి ఉంది. వచ్చే వానాకాలంలోపు ఈ పనులు పూర్తి చేస్తే గానీ గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల ప్రయాణాలకు ఇబ్బందులు తీరవు.

ఎదురుచూపులు

గత కొంతకాలంగా జిల్లాలో పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న రోడ్లు దెబ్బతినడంతో పల్లెల్లో దారులు అస్తవ్యస్తంగా మారాయి. వీటికి తక్షణం మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇందుకోసం ఎంఆర్ఆర్ కింద 2021–22 సంవత్సరానికి గాను మొత్తం 40 పనులకు రూ.18.48కోట్లు మంజూరయ్యాయి. వీటిలో 38పనులకు టెండర్లు పూర్తయ్యాయి. మొదట ఈ పనులకు టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఒక్కో చోట రెండు మూడు సార్లు టెండర్లు పిలిచారు. చివరికి కొందరు ఆసక్తి చూపించడంతో పనులు మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో రెండు చోట్ల ఒకటి పంచాయతీరాజ్ పరిధి నుంచి ఆర్అండ్‌బీకి బదిలీ కాగా, మరో చోట ఇంకా టెండర్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. వీటికి సంబంధించి అగ్రిమెంట్లు జరుగుతున్నాయి. ఇక బీటీ రెన్యూవల్ కింద 2022–23 ఆర్థిక సంవత్సరంలో మరో 46 రోడ్లు మరమ్మతుల పనులకు మంజూరు వచ్చాయి. వీటికి రూ.37.99 కోట్లు వ్యయం చేయనున్నారు. ఇందులో బీటీఆర్ కింద 21పనులు, గత వానాకాలంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న 25చోట్ల మొత్తం 46చోట్ల పనులు చేయనున్నారు. వీటిలో 29 పనులకు సంబంధించి గ్రౌండింగ్ పూర్తయ్యాయి. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు పూర్తయి పనులు మొదలు కావాల్సి ఉంది.

రాకపోకలకు అవస్థలు

రోడ్లు దెబ్బతిని ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లలో అనేక చోట్ల వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. గత వర్షాకాలంలో జిల్లాలో కురిసిన అధిక వానలకు చాలా చోట్ల రోడ్లు దె బ్బతిన్నాయి. వాటికి అప్పుడే మరమ్మతుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. చా లా చోట్ల నిధులు మంజూరు కాలేదు. రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టారు. దీంతో రోడ్డు ప్ర యాణంలో ఇబ్బందులు ఎదరువుతున్నాయి. మళ్లీ జూన్‌లో వర్షాలు పడే అవకాశం ఉన్నందు న ఈ రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తేనే రాకపోకలకు ఇబ్బంది ఉండదు. చాలా చోట్ల టెండ ర్ల దశ నుంచి అగ్రిమెంట్లు, పనుల ప్రా రంభ మే నత్తనడకన సాగుతుండడంతో ఈ వేసవిలో పనులు పూర్తవుతాయా? అనేది తేలాల్సి ఉంది.

వేసవిలోపు పనులు పూర్తి

ఎంఆర్ఆర్, బీటీఆర్ కింద మంజూరైన రోడ్లు, వరదలతో దెబ్బతిన్న చోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. కొన్ని చోట్ల అగ్రిమెంట్లు కూడా అవుతున్నాయి. వచ్చే రెండు నెలల్లో జిల్లాలో అన్ని పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక వేశాం. వేసవి లోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– జే.ప్రకాశ్, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ

సీఎం కేసీఆర్ కృషితోనే ఇళ్లపట్టాలు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: సీఎం కేసీఆర్ కృషితోనే పట్టణ ప్రజలకు ఇళ్ల పట్టాల పంపిణీ జరుగుతోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం స్థానిక పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, కలెక్టర్ సంతోష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్‌లతో కలిసి లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ పట్టణంలో ఏడు వేల మందికి పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇళ్లపట్టాలకు బ్యాంకు రుణాలు కూడా మంజూరవుతాయని తెలిపారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రజల ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారమైందని అన్నారు. కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ, సింగరేణి లీజు భూముల్లో ఇళ్లు కట్టుకున్న వారికి పట్టాలు ఇవ్వడం కోసం ప్రభుత్వం దరఖాస్తు గడువును పొడిగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, బెల్లంపల్లి ఆర్డీవో కె.శ్యామలదేవి, తహసీల్దార్ కుమారస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పాల్గొన్నారు.

'కార్యకర్తలే నా బలగం'

భీమిని: బీఆర్ఎస్ కార్యకర్తలే తన బలగమని, వారికి ఏ కష్టమొచ్చిన అండగా ఉంటానని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం కన్నెపల్లి మండలం టీకులపల్లి వద్ద సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ దండె విఠల్, గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, కన్నెపల్లి జెడ్పీటీసీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా 'బలగం'



వేంపల్లిలో సినిమా వీక్షిస్తున్న గ్రామస్తులు

- ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా సినిమా ప్రదర్శన
- ముగింపు సన్నివేశాల్లో మహిళల భావోద్వేగాలు
- పాతరోజులను గుర్తుకు తెచ్చుకుంటున్న వృద్ధులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట/నెన్నెల: పల్లె.. పట్టణాల్లో ప్రజల్లోని అనుబంధాలను బలగం సినిమా తట్టిలేపుతోంది. గ్రామీణ నేపథ్యం.. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ.. ఆప్యాయత.. అనురాగాలతో రూపుదిద్దుకున్న చిత్రం ఊరూరా ప్రదర్శితమవుతోంది. ఆస్తులు.. అంతస్తులు కాదు అనుబంధాలే ముఖ్యమనే ఇతివృత్తంగా సాగిన అందరినీ ఆకట్టుకుంటోంది. థియేటర్ వరకు వెళ్లి చూడలేని వృద్ధులు, ప్రజల కోసం గ్రామాల్లోని సర్పంచులు, యువత, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి అందరూ చూసేలా చేస్తున్నారు. ఈ చిత్రానికి జిల్లాలోని మందమర్రి మండలం దీపక్‌నగర్‌కు చెందిన రమేష్ ఎలిగేటి కథ, మాటలు, స్క్రీన్‌ప్లేలో సహకారం అందించడం గమనార్హం. హాజీపూర్ మండలం పడ్తనపల్లి, రాపల్లి, నర్సింగాపూర్, హాజీపూర్, వేంపల్లి, నస్పూర్ మున్సిపాలిటీ, లక్సెట్టిపేట మండలం బలరావుపేట, గుల్లకోట, జెండావెంకటాపూర్, అంకతిపల్లి, హన్మంతుపల్లి. గంపలపల్లి, ఆంధ్రాకాలనీ, నెన్నెల మండలం చిత్తాపూర్, గొల్లపల్లి, నెన్నెలలో సినిమా ప్రదర్శన చేశారు. సినిమా చివరి సన్నివేశాల్లో మహిళలు భావోద్వేగాలకు గురై కంటతడి పెడుతున్నారు.

గుర్తుకొస్తున్నాయి..

గ్రామాల్లో బలగం సినిమా ప్రదర్శన మూడు నాలుగు దశాబ్దాల క్రితం వాతావరణాన్ని గుర్తుకు తెస్తోంది. అప్పట్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక తెరలు ఏర్పాటు చేసి సినిమా ప్రదర్శించేవారు. టీవీల రంగ ప్రవేశంతో శని, ఆదివారాల్లో దూరదర్శనలో వచ్చే సినిమా కోసం, గురు, శుక్రవారాల్లో వచ్చే చిత్రలహరి పాటల కోసం అంతా ఒకే చోట చేరి వీక్షించేవారు. పంచాయతీల వద్ద కూడా టీవీలు ఏర్పాటు చేసి రామాయణ, భాగవతాలు, యక్షగానాలు, బుర్రకథలు, ఒగ్గుకథలు ప్రజలకు చూపించిన సందర్భాలు ఉన్నాయి. నాటి కాలంలో సినిమా, టీవీ ప్రదర్శన ఉంటే పంచాయతీలు, రచ్చబండల వద్ద ఈతకమ్మల సాపలు, గన్నీసంచులు, తాటపత్రిలు, కవర్లు పరిచి కూర్చునేవారు. ప్రస్తుతం బలగం సినిమా ప్రదర్శనకూ అలాగే తరలొచ్చి కింద కూర్చుని చూస్తున్నారు.

అందరూ చూడాల్సిన సినిమా



గ్రామాలు, పట్టణాల్లో అందరూ చూడాల్సిన కుటుంబ కథాచిత్రం బలగం సినిమా. గ్రామాల నుంచి థియేటర్లకు వచ్చి చూడలేని వారి కోసం ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా సినిమాను చూపిస్తున్నారు. మా గ్రామ ప్రజలకు సినిమా చూపించడం జరిగింది. ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

– గోళ్ల రవీందర్, సర్పంచ్, గ్రామం: గుల్లకోట, మం: లక్సెట్టిపేట

నాటి రోజులు గుర్తుకొచ్చాయి..



చాలా ఏళ్ల కిందట ఊర్లల్లో తెల్లబట్టకట్టి సినిమా వేసేటోళ్లు, ఇప్పుడు ఆ పాతకాలం నాటి రోజులు గుర్తుకు తెచ్చుకోవడం ఆనందంగా ఉంది. ఒక సినిమా ఊర్లలో చూపడం చాలా రోజులకు కనిపించింది. ఒకచోట చేరి ముచ్చటపెడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతో కలగలిసిన సినిమా చూడడం మర్చిపోలేం.

– కందుల మల్లయ్య, గ్రామం: గుడిపేట, మం:హాజీపూర్

ముక్క సినిమా చూసినట్టుంది..



మా చిన్నప్పుడు గ్రామాల్లో ముక్క సినిమా చూపించేవారు. అందరం సాయంత్రం వెళ్లి చూసేవాళ్లం. బలగం సినిమా వల్ల ముక్క సినిమా చూసినట్లు గుర్తుకువస్తుంది. బలగం అంటేనే కాకి బలగం. చాలా కుటుంబాల్లో గొడవలు ఉంటున్నాయి. తప్పు తెలుసుకుని సరిదిద్దుకుంటే కుటుంబాలు విడిపోవు. సినిమా చాలా బాగుంది.

– గటికె మల్లయ్య, గ్రామం: గుల్లకోట, మం: లక్సెట్టిపేట

ఏడుపు వచ్చింది..



గ్రామాల్లోని ప్రజలు టాకీస్‌లకు వెళ్లకుండా గ్రామంలోనే సినిమా చూసేందుకు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉన్నది. అందరం ఒక చోట కూర్చుని సినిమా చూస్తున్నంతసేపు ఏడుపు వచ్చింది. ఇంటిల్లిపాది వచ్చి సినిమా చూస్తున్నారు. కుటుంబం కలిసేటప్పుడు చాలా సంతోషంగా ఉన్నది.

– మామిండ్ల చిలుకమ్మ, గ్రామం: జెండవెంకటాపూర్, మం: లక్సెట్టిపేట

బహిరంగ సభను విజయవంతం చేయండి

- హాజరుకానున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే
- ఏఐసీసీ సభ్యుడు ప్రేంసాగర్‌రావు



సభాస్థలిని పరిశీలిస్తున్న ప్రేంసాగర్‌రావు, సురేఖ

నస్పూర్: ఈ నెల 14న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని టవర్స్ ఎదురుగా నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నస్పూర్‌లోని బహిరంగ సభాస్థలిని డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో భాగంగా సభ నిర్వహిస్తున్నటుల తెలిపారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాజస్థాన్ సీఎం అశోక్‌గెహ్లాట్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు, యువకులు, మేధావులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, కౌన్సిలర్ సురిమిల్ల వేణు, బొద్దున సంధ్యారాణి, శీపతి సుమతి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్ల సంపత్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీద్, నాయకులు పాల్గొన్నారు.

ఏఐసీసీ కార్యదర్శి పరిశీలన

నస్పూర్: పట్టణంలో సభాస్థలిని ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి సోమవారం టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హర్కల వేణుగోపాల్‌రావు, ఏఐసీసీ సభ్యుడు ప్రేంసాగర్‌రావు, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, సీనియర్ నాయకులు నిరంజన్ పాల్గొన్నారు.

'భట్టి'ని కలిసిన కాంగ్రెస్ నాయకులు



శిబిరంలో 'భట్టి'తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

శ్రీరాంపూర్: పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భాగంగా శ్రీరాంపూర్‌కు చేరిన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కను పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిశారు. ఉమ్మడి జిల్లాలో పాదయాత్ర చేస్తున్న ఆయన ఆదివారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియానికి చేరారు. ఇక్కడ ఏర్పాటు చేసి శిబిరంలో ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇక్కడి నుంచి నేరుగా ఆయన 14న నస్పూర్ కలెక్టరేట్ సమీపంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. అప్పటివరకు ఆయన శిబిరంలోనే ఉంటారని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ తెలిపారు. సోమవారం 'భట్టి'ని శిబిరం వద్ద ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, రాష్ట్ర నాయకులు మదన్‌మోహన్‌రావు, విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కలిశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, కౌన్సిలర్లు తెనుగు లావణ్యదేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 77 మంది గైర్హాజరు



పరీక్ష కేంద్రంలో కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్షలకు సోమవారం 77 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో 55 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన సామాన్య శాస్త్రం పరీక్షకు 10,261 మంది విద్యార్థులకు గాను 10,185 మంది హాజరయ్యారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 10,125 మంది కాగా 10,071 మంది హాజరయ్యారు. గతంలో ఫెయిలైన విద్యార్థులు 136 మందికి గాను 114 మంది పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ బాదవత్ సంతోష్, డీఈవో వెంకటేశ్వర్లు, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సేయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ బాదావత్ సంతోష్ సోమవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల గదులు, హాజరు రిజిస్టర్, సీసీ కెమెరా కంట్రోల్ రూమ్‌లను పర్యవేక్షించారు. అనుమతి లేకుండా ఎవరినీ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవద్దని సూచించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న నారదాసు లక్ష్మణ్‌రావు

లక్సెట్టిపేట: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సార్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా ఉపయోగపడుతున్నాయో అవగాహన కల్పించాలని తెలిపారు. పట్టణం, గ్రామాల్లో కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలపారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రాబోవు ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధిస్తుందని అందరూ ధీమాగా ఉండాలని అన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతోపాటు సమయపాలన పాటిస్తూ భాగస్వాములుగా కలిసిమెలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా పార్టీలో చేరిన పలువురికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, యువజన నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, మండలాధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సమ్మెటివ్ పరీక్షలకు విద్యాశాఖ సన్నద్ధం

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్షలు ఈ నెల 11న ముగియనుండగా.. ఒకటి నుంచి తొమ్మిదో తరగతికి 2022–23 సమ్మెటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ)–2 పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. పేపర్ లీకేజీ నేపథ్యంలో పరీక్షలు పకడ్బందీ నిర్వహణకు ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 12 నుంచి 20 వరకు పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉదయం 9.30 గంటల నుంచి 12.00 గంటల వరకు, ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు 9.30గంటల నుంచి 12.15 గంటల వరకు, తొమ్మిదో తరగతికి 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఎస్ఏ–2 ప్రశ్నపత్రాలు మండల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ఎస్ఏ–2 టైం టేబుల్ అనుసరించి ఏ రోజు ప్రశ్నపత్రాలు ఆ రోజు సబంధిత డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఉదయం 8గంటలకు తీసుకెళ్లాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. ఏప్రిల్ 10నుంచి ప్రశ్నపత్రాలు తీసుకెళ్లొచ్చని సూచించారు. ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఒకటి నుంచి ఐదు తరగతుల ప్రశ్నపత్రాలు ఒకేసారి తీసుకెళ్లి పాఠశాలలో భద్రపర్చాలని ఆదేశించారు. 6 నుంచి 9వ తరగతి వరకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టైంటేబుల్ ప్రకారం ఏ సబ్జెక్టులు ఉంటే ఆ సబ్జెక్టు పేపర్లు అదే రోజు ఉదయం 8గంటలకు మండల డిస్ట్రిబ్యూషన్ పాయింట్ నుంచి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. పరీక్షల్లో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

వీధికుక్కల దాడిలో ఒకరికి గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదురుగా జాతీయ రహదారి మీదుగా బైక్‌పై వెళ్తున్న తిప్పని తిరుపతిని సోమవారం వీధి కుక్కలు దాడి చేసింది. బైక్‌పై వెళ్తుండగా వెంబడించడంతో భయాందోళనకు గురై అదుపుతప్పి కిందపడ్డాడు. రెండు కుక్కల దాడి చేయడంతో తిరుపతికి గాయాలయ్యాయి. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

కౌటాల: జీవితంపై విరక్తితో ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని నదిమాబాద్ కాలనీకి చెందిన నస్పురి పోశం (52) గతకొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. అతని భార్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో మద్యం మత్తులో గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరివేసుకొని వివాహిత..



శ్యామల మృతదేహం

వేమనపల్లి: ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కేతన్‌పల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని ఒడ్డుగూడానికి చెందిన శ్యామల (22), వేమనపల్లి మండలం కేతన్‌పల్లికి చెందిన సాగర్‌తో గత మూడేళ్ల క్రితం వివాహమైంది. ఉపాధి కోసం కరీంనగర్‌కు వెళ్లారు. గత నెల రోజుల క్రితం కేతన్‌పల్లికి వచ్చారు. కాపురంలో చిన్న మనస్పర్థలు ఉన్నట్లు తెలుస్తోంది. భర్త కట్టెల కోసం అడవికి వెళ్లగా ఇంట్లో భార్య దూలానికి ఉరివేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త ఇరుగుపొరుగు వారిని పిలిచి భార్యను కిందికి దించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతురాలి తల్లిదండ్రులు రాత్రివరకు కేతన్‌పల్లికి చేరుకోలేదు. ఆమె మృతిపై పూర్తి కారణాలు తెలియరాలేదు. హెడ్‌కానిస్టేబుల్ చెన్నారెడ్డి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వక ట్రస్టు భవన్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై జిల్లా అఖిలపక్షం, టీఎస్‌పీఎస్సీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు టీజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ బి.బాబన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, అన్ని పార్టీల జిల్లా బాధ్యులు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

‘ఓసీసీ’ గుర్తింపు ఎన్నికలెప్పుడు ?

- గడువు ముగిసి 18 నెలలు..
- ఇప్పటికీ ఎన్నికలపై ఊసేలేదు
- మూడున్నరేళ్లలో యూనియన్ కమిటీ మీటింగ్‌లు లేవు
- ప్రభుత్వ అండతోనే కొనసాగుతున్న గుర్తింపు సంఘం



ఓరియంట్ సిమెంట్ కంపెనీ

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల గడువు ముగిసి 18 నెలలు కావస్తోంది. అయినా ఇప్పటికీ ఎన్నికలపై ఊసే లేదు. ప్రభుత్వ అండతోనే గుర్తింపు సంఘం కొనసాగుతోంది. 2019 అక్టోబర్ 19న గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించగా ఫిలిం అసోసియేషన్ చైర్మన్ పూస్కూరి రామ్మోహన్‌రావు యూనియన్ తరఫున గెలుపొంది అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. హైదరాబాద్‌లో ఉండే ఈయన కనీసం ఆరు నెలలకు కనిపించకుంటే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని కార్మికులు వాపోతున్నారు. ఎన్నికలు జరిగి మూడున్నరేళ్లు గడుస్తున్నా, కాలపరిమితి ముగిసినా గుర్తింపు యూనియన్ కమిటీ, ఒక్క జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించలేదు. కేవలం వర్కింగ్ ప్రెసిడెంట్‌ను పెట్టిన నామమాత్రం తప్పితే ఒక్క పోస్టును నాయకులకు కేటాయించలేదనే విమర్శలున్నాయి. దీంతో కార్మికులకు యాజమాన్యం ఒత్తిడి తప్పడం లేదు. ప్రశ్నిస్తే డ్యూటీకి రాకుండా బెదిరిస్తున్నారని, గ్రేడ్‌లు, ఇంక్రిమెంట్‌లు అలాగే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మజ్దూర్‌గా ఉన్న కార్మికులు ఆపరేటర్, మిల్లర్ పనులు చేస్తున్నారని ఏళ్ల తరబడి అదే ఈ గ్రేడ్‌లో కొనసాగిస్తున్నారు. గ్రేడ్లు చేంజ్ చేయకపోవడంతో నష్టపోతున్నామని పలువురు వాపోతున్నారు.

డ్యూటీకి రావొద్దని..

కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి అధ్వానంగా మారింది. మంచి చేయకున్నా ఫర్వాలేదు మాకు అన్యాయం చేశారని వాపోతున్నారు. టిఫిన్ కూపన్ రేటు రూ.130 నుంచి రూ.255కు పెంచారని, మిగతా వారికి రూ. 31 కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలపై అడిగితే డ్యూటీకి రావొద్దని చెబుతున్నారు. చెప్పుకుందాం అంటే నాయకులు లేరు. తమ వెంట రండి సమస్యలు పరిష్కరిస్తా అని మైనింగ్ డిపార్టుమెంట్ వారిని తిప్పుకొని ఇప్పుడు వదిలేశారు. అటు యాజమాన్యం ఒత్తిడి ప్రశ్నించేవారు లేక బానిసలుగా పనులు చేయాల్సి వస్తోంది. నాయకుల్లో అసంతృప్తి పెరిగిపోయింది. అధికార పార్టీ కావడంతో ఆధిష్ఠానం నిర్ణయం మేరకు గెలిపించినాం, కార్మికులకు చేసింది ఏమి లేదు కనీసం నాయకులకు కలిసింది లేదు. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినా నేటికి కమిటీలు వేయకుండా తమకు పదవులు ఇవ్వకుండా కార్మికులకు ముఖం చూపలేకపోతున్నామని మదనపడుతున్నారు. అలాగే అధికారులపై ఒత్తిడి చేసి ఎన్నికలు జరగనీయకుండా చేస్తున్నారనే విమర్శలున్నాయి.

హామీల అమలు ఊసేలేదు

గుర్తింపు ఎన్నికల సమయంలో చేసిన హామీలు ఒక్క టి నెరవేర్చింది లేదు. బెల్లంపల్లి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేల సమక్షంలో పలు హామీలు ఇచ్చారు. మెడిక్లెయిమ్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచుతానని రూ.2 లక్షలే కొనసాగుతోంది. స్థానికులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని, స్కిల్ డెవలప్‌మెంట్‌కు శిక్షణ కంపెనీ ద్వారా ఇప్పిస్తానని, ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తానని హామీలతో స్థానిక ఆదివాసీలకు అన్యాయం జరి గింది. కమ్యూనిటీ హాల్ నిర్మాణం, కంపెనీ ద్వారా కళాశాల ఏర్పాటు పలు హామీలు నోచుకోలేదు.

కార్మికులే బుద్ధి చెబుతారు



అధికార బలంతో ఎన్నికలు ఆపి కార్మికుల సమస్యలు గాలికి వదిలేస్తే కార్మికులే బుద్ధి చెబుతారు. త్వరలోనే కోర్టు ద్వారా ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి. ఇప్పటి వరకు కార్మికులకు నా హయాంలో చేసినవి తప్పితే కొత్తగా చేసింది ఏం లేదు. కార్మికులకు అండగా ఉంటా.

– రాములు నాయక్, గుర్తింపు సంఘం మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



కుమార్

శ్రీరాంపూర్: సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్(1630/1982) శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడిగా నెలబోయిన కుమార్‌ను ఎన్నుకున్నా రు. సోమవారం నస్పూర్ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో కేంద్ర కమిటీ అధ్యక్షుడు యాట ఓదెలు, వర్కింగ్ ప్రెసిడెంట్ గంగారపు లింగమూర్తి సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏరియా సెక్రెటరీగా కంబాల నాగయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా చెన్నూరి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా జాడి క్రాంతి కుమార్, ట్రెజరర్‌గా చెరిపెల్లి సురేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ దామెర ప్రవీణ్, సెంట్రల్ ఉపాధ్యక్షుడు ఆరపెల్లి రాంచందర్ పాల్గొన్నారు.

నేతకాని రక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాస్



చెన్నూర్: నేతకాని రక్షణ సంఘం (ఎన్ఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా గంగారాం గ్రామానికి చెందిన కామెర శ్రీనివాస్‌ను సోమవారం హన్మకొండలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు జాడి ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను నేతకానిలు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి జాడి ఈశ్వర్, సంయుక్త కార్యదర్శి బండారి సురేశ్, కోశాధికారి బొౌతు రాజులు పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ



మూసి వేసిన ఆర్కే 8 గని ముఖద్వారం

- ఆర్కే 8 గనిలో తీసిన ఉత్పత్తి అనుమతులకు
- ఎస్సార్పీ 3,3ఏ గనికి అధిక ఉత్పత్తితో ఉల్లంఘన కేటగిరి..
- శాంతి మైదానంలో సభ ఏర్పాటు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని రెండు భూగర్భ గనులకు నేడు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరుగనుంది. మంగళవారం కృష్ణాకాలనీలోని శాంతి మైదానంలో ఈ సభ ఉంటుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్సార్పీ 3,3ఏ గని, 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్కే 8 గనికి సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ జరుగనుంది. జాయింట్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అధ్యక్షతన జరిగే సభకు నిజామాబాద్ రీజియన్ కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ లక్ష్మణ్ ప్రసాద్ హాజరుకానున్నారు. ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి, కార్పొరేట్ నుంచి ఎన్విరాన్‌మెంట్ అధికారులు, మైనింగ్, ఏరియా అధికారులు పాల్గొననున్నారు. కార్మిక సంఘాల నాయకులు, గనుల పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించారు.

మూసివేసిన ఆర్కే 8 గని..

ఈ గని 1993లో ఏర్పాటు చేశారు. బొగ్గు నిల్వలు అడుగంటిపోవడంతో 2020 అక్టోబర్ 10 గనిని మూసివేశారు. ఐతే ఎన్విరాన్‌మెంట్ యాక్ట్ 2017 ప్రకారం అప్పటి నుంచి తీసిన బొగ్గుకు పర్యావరణ అనుమతి(ఈసీ) తీసుకోవాల్సి ఉంది. మైన్ ఓపెన్ చేసినప్పుడు ఈ నిబంధనలు లేవు. తర్వాత నిబంధనలు రావడంతో గని మూసివేసిన కూడా కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు పర్యావరణ కాలుష్యంపై ఇప్పుడు ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. ఇది నిబంధనల్లో భాగమే అని, కొత్తగా ఇందులో నుంచి అండర్‌గ్రౌండ్ మైనింగ్ ద్వారా బొగ్గు తీసేది లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ గని ప్రభావిత గ్రామాలుగా జైపూర్ మండలం రామారావుపేట గ్రామం ఉంది. ప్రాజెక్టు ఏరియా 165.47 హెక్టార్లు, సాలీనా బొగ్గు ఉత్పత్తి 0.16 మిలియన్ టన్నులుగా ఇన్నాళ్లు ఉంది. ఉల్లంఘన కేటగిరి కింద ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది.

ఎస్సార్పీ 3, 3ఏ గనిలో అధిక ఉత్పత్తి

ఈ గని 1988లో ఏర్పడింది. ప్రస్తుతం గని నడుస్తున్నది. దీనికి ఉన్న పర్యావరణ అనుమతి మించి 2007–08లో 7 వేల టన్నులు, 2008–09లో 2 వేల టన్నులు అధికంగా ఉత్పత్తి చేసినందుకు గాను ఉల్లంఘన కేటగిరి కింద ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారు. ఈ గని ప్రాజెక్టు ప్రాంతం 299 హెక్టార్లుగా ఉంది. సాలీనా 0.40 మిలియన్ టన్నుల బొగ్గును తీస్తున్నారు. నస్పూర్ మండలంలోని శ్రీరాంపూర్ ప్రాంతం దీని ప్రభావిత గ్రామంగా ఉంది. ఆ రెండేళ్లలో మొత్తం 9 వేల టన్నులు బొగ్గు తీయడానికి అనుమతి లేక పర్యావరణ నిబంధనల మేరకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారు. ఈ రెండు గనుల ప్రభావిత గ్రామాల వారు వెలిబుచ్చే కాలుష్య సమస్యలు, పర్యావరణ సమస్యలను అధికారులు నమోదు చేసుకుంటారని కంపెనీ అధికారులు తెలిపారు.

అనుమతి లేని వెంచర్.. నిర్మాణానికి ఇక్కట్లు



సీతారాంపల్లిలో వెలసిన అక్రమ వెంచర్

- నిబంధనలు పాటించని యజమానులు
- మున్సిపల్ ఆదాయానికి గండి

నస్పూర్: నస్పూర్ పట్టణం జిల్లా కేంద్రం మంచిర్యాలకు ఆనుకుని ఉండడం, సమీకృత కలెక్టరేట్ నిర్మిస్తుండడం, సింగరేణి పారిశ్రామిక ప్రాంతం కావడంతో నస్పూర్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఇదే అదునుగా కొందరు రియల్టర్లు భూముల్లో అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇళ్లనిర్మాణానికి మున్సిపల్ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో సుమారు 20కి పైగా వెంచర్లు ఉండగా.. 8 వెంచర్లకు మాత్రమే అనుమతులు ఉండడం గమనార్హం.

అడ్డుకోని అధికారులు..

అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్న సమయంలో అధికారులు అడ్డుకోవడం లేదు. ప్లాట్లు విక్రయించిన తర్వాత ప్రజలు ఇళ్లు నిర్మిస్తున్న సమయంలో అనుమతి నిరాకరించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అనుమతి లేని వెంచర్లపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే హద్దురాళ్ల తొలగింపు వంటి నామమాత్ర చర్యలు తీసుకుంటున్నారు.

మున్సిపల్ ఆదాయానికి గండి..

వ్యవసాయ భూమిని నాన్ అగ్రికల్చర్ భూమిగా మార్చాలంటే ముందుగా రెవెన్యూ అధికారుల నుంచి నాలా పర్మిషన్ తీసుకోవాలి. ఆ తర్వాత లే అవుట్ కోసం మున్సిపాలిటీ నుంచి అనుమతి పొందాలి. లే అవుట్ వెంచర్ భూమిలో నుంచి కొంత భూమిని మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేయాల్సి ఉంటుంది. ఆ భూమిని మున్సిపల్ అధికారులు ప్రజా, ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తారు. కానీ వెంచర్ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడం వల్ల మునిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఒకే ఒక్క అధికారి..

మున్సిపాలిటీ పాలన విభాగాల్లో అత్యంత కీలకమైనది టౌన్ ప్లానింగ్ విభాగం. పదుల సంఖ్యలో అక్రమ వెంచర్లు ఏర్పాటు అయ్యాయి. పట్టణంలో రోజుకు పదుల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతుంటాయి. ఇళ్ల నిర్మాణాల అనుమతుల కోసం పలువురు మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకుంటారు. వీటన్నింటినీ పర్యవేక్షించేది టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులే. మున్సిపాలిటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఒక టీపీఎస్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అతను కూడా వారంలో రెండు రోజులు నస్పూర్ మున్సిపాలిటీలో, మరో నాలుగు రోజులు వేరే మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తారు. దీంతో పర్యవేక్షణ కరువై యథేచ్ఛగా అక్రమ వెంచర్ల ఏర్పాటు, అక్రమ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని పటిష్ఠపరిచి అక్రమ వెంచర్లు, అక్రమ ఇళ్ల నిర్మాణాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనరాదు



పట్టణంలో ఏర్పాటైన అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనరాదు. కొనుగోలు చేసిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వబడవు. అక్రమ వెంచర్ల యజమానులకు నోటీసులు జారీ చేసి వారిపై చర్యలు తీసుకుంటాం.

– టి.రమేశ్, మున్సిపల్ కమిషనర్

సమస్యలు పరిష్కరించాలని నిరసన దీక్ష



దీక్షలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్ల ఆరోగ్య పరిరక్షణలో పేరుకు మాత్రమే ఈహెచ్ఎస్ కార్డులు జారీ చేశారని, నగదు రహిత వైద్య చికిత్సకు నోచుకోవడం లేదని తెలిపారు. వృద్ధాప్యంలో అనేక రకాల అనారోగ్యానికి గురికావడం జరుగుతోందని, రూ.లక్షలు వైద్యం కోసం చెల్లించాల్సి వస్తుందని వాపోయారు. 11 పీఆర్సీ సూచించనట్లుగా మూల పెన్షన్ నుంచి ఒక శాతం మినహాయించి పూర్తి స్థాయిలో వైద్య సదుపాయం కల్పించాల్సి ఉన్నా గత నాలుగేళ్లుగా అందించడం లేదని తెలిపారు. రీయింబర్స్‌మెంట్ బిల్లులు నెలల తరబడి వివిధ కార్యాలయాల్లో మగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రతీ నెల పింఛన్ కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు క్రిష్ణ, బెజ్జంకి జగన్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారత్ బచావో రాష్ట్ర కమిటీలో చోటు



వడ్డేపల్లి మనోహర్



సమ్ము రాజయ్య

పాతమంచిర్యాల: భారత్ బచావో రాష్ట్ర కమిటీలో మంచిర్యాల జిల్లాకు చెందిన వడ్డేపల్లి మనోహర్, సమ్ము రాజయ్యలకు చోటు దక్కింది. రాష్ట్ర కమిటీ సభ్యులుగా నియామకం చేసినట్లు భారత్ బచావో జాతీయ నాయకులు గాదె ఇన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుల నియామకం చేశామని తెలిపారు.

జిల్లా అధ్యక్షురాలిగా కవిత



కొట్ల అనిత

మందమర్రిరూరల్: ఉపాధి హామీ పథకం(ఈజీఎస్) కంప్యూటర్ ఆపరేటర్స్ అండ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా మందమర్రికి చెందిన కొట్ల అనిత ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మందమర్రి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అనితను ఈజీఎస్ సిబ్బంది అభినందించారు. తుంగపిండి సాగర్, చారి తదితరులు పాల్గొన్నారు.

‘గొర్రెలకాపరులకు ప్రభుత్వం చేయూత’



మాట్లాడుతున్న అశోక్‌యాదవ్

భీమారం/కోటపల్లి: గొర్రెలకాపరులకు ప్రభుత్వం చేయూతనిస్తోందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన భీమారం మండల కేంద్రం, కోటపల్లి మండలం మల్లంపేట గ్రా మంలో గొర్రెల పెంపకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గొర్రెలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని, అనారోగ్య సమస్యలు ఏర్పడితే పశువైద్యాధికారుల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపడుతుందని తెలిపారు. నాయకులు బోయిని మల్లేశ్, రాపల్లి రాజన్న, కోల కిష్టయ్య పాల్గొన్నారు.

తీరం వెంట హెలికాప్టర్ చెక్కర్లు



ప్రాణహిత నదిపై నుంచి వెళ్తున్న హెలికాప్టర్

వేమనపల్లి: మంచిర్యాల జిల్లాను ఆనుకొని ఉన్న ప్రాణహితనది తీరం వెంట సోమవారం మధ్యాహ్నం హెలికాప్టర్ చెక్కర్లు కొట్టింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా రేగుండ పోలీస్‌స్టేషన్ మారుమూల అటవీ ప్రాంతం ఉండటంతో అక్కడికి రోడ్డు సౌకర్యం లేదు. అక్కడ పనిచేసే పోలీసు సిబ్బందిని జిల్లా కేంద్రానికి తీసుకెళ్లేందుకు అక్కడి ప్రభుత్వం ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా తరలించినట్లు తెలుపుతున్నారు. రేగుంట పోలీస్‌స్టేషన్ వద్ద ల్యాండ్ అయిన హెలికాప్టర్ 5 నిమిషాల వ్యవధిలో ఆకాశంలోకి వెళ్లి గడ్చిరోలి జిల్లా కేంద్రం వైపు వెళ్లింది. నది ప్రవాహ మార్గం వెంట హెలికాప్టర్ మంచిర్యాల జిల్లాతోపాటు మహారాష్ట్రలోని గడ్చిరోలి, ప్రాణహిత తీర గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ సుమన్

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలం మల్యాల గ్రామానికి చెందిన వలసాని సుమన్(28) పని నిమిత్తం మంచిర్యాలకు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. సోమవారం వేకువజామున శ్రీరాంపూర్ బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

‘ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలి’

కాగజ్‌నగర్‌రూరల్: ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ సభలను జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) కుమురంభీం, మంచిర్యాల డివిజన్ కమిటీ కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తరతరాల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా విప్లవ రైతు కూలీ సంఘం నాయకత్వంలో పోరాడి నులివెచ్చని నెత్తుర్లు చిందించిన త్యాగాల ఇంద్రవెల్లికి 42 యేళ్లు గడిచిన సందర్భంగా అమరుల సంస్మరణ సభల్లో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆదివాసీ హక్కు చట్టాలకు తూట్లు పొడిచి జీఓ నెం.3 చట్టాన్ని తుంగలో తొక్కి రాష్ట్రంలో లంబాడీలు, ఆదివాసీలకు చిచ్చు పెట్టారని పేర్కొన్నారు. ఆదివాసీ భూములను బీజేపీ నాయకులు పాయల శంకర్, లోక ప్రవీణ్‌రెడ్డి వంటి రియల్ ఎస్టేట్ మాఫియాలు యథేచ్ఛగా కబ్జా చేస్తూ విద్రోహ రాజకీయాలు చేస్తున్నారని, వారిని తరిమికొట్టాలని తెలిపారు. మరోవైపు బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం హరితహారం, ధరణి పోర్టల్, బృహత్ ప్రకృతి వనం, టైగర్‌జోన్, ఓపెన్ కాస్టుల పేర్లతో దళిత ఆదివాసీల భూములను గుంజుకుని గెంటేస్తోందని పేర్కొన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల సాక్షిగా వారసత్వాన్ని ఇప్పటికీ కొనసాగిస్తూ గ్రామగ్రామాన ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ సభలు, సమావేశాలు నిర్వహించాలని తెలిపారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న దిలీప్‌కుమార్

ఉట్నూర్: గిరిజనుల అర్జీలు త్వరగా పరిష్కరించాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వారి అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున గిరిజన గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పీవీటీజీ అధికారి భాస్కర్, జేడీఎం నాగభూషణం, ఏవో రాంబాబు, పీఈటీసీ ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా రుణం మంజూరు చేయాలని నార్నూర్ మండలం మహాగావ్‌కు చెందిన రాథోడ్ భరత్, ఉట్నూర్ మండలం హస్నాపూర్‌కు చెందిన శ్రీధర్ కుమార్ అర్జీలు సమర్పించారు.
- ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూమికి అటవీ హక్కు పత్రం అందించాలని బజార్‌హత్నూర్ మండలం లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన అడె శ్రీరాం వేడుకున్నాడు.
- గిరి వికాసం ద్వారా తన పంట పొలం వద్ద బోరుబావి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఇంద్రవెల్లి మండలం ధన్నోర(బి)కి చెందిన కుర్సెంగ ప్రభాకర్ అర్జీ పెట్టుకున్నాడు.